క్లుప్తంగా

23న గ్రామ సభలు

మాడుగుల రూరల్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 23న గ్రామ సభలు నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో జి.వి.ఎస్. గోపాలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఐదు సంవత్సరాల వ్యవధిలో జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టబోయే పనులు గుర్తించుటకు గ్రామ సభలను నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో ప్రజా ప్రతినిధులను, ప్రజలను భాగస్వాములను చేయాలని కోరారు.

ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలి

- తహసీల్దార్ లక్ష్మి, ఏవో కాంతమ్మ



ఎ.కొత్తపల్లి పంటల నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మి, ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: ప్రతీ రైతు పంటల నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని తహసీల్దార్ ఎం. లక్ష్మి, మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ సూచించారు. ముషిడిపల్లి, ఎ. కొత్తపల్లి, కె.ఎం.పాలెం గ్రామాల్లో మంగళవారం వారు పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీఆర్వో, అగ్రికల్చర్ అసిస్టెంట్, గ్రామ సర్వేయర్ కలిసి టీమ్‌గా పారదర్శకంగా పంటల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం సాగు చేస్తున్న వారు పేరిట మాత్రమే పంటల నమోదు చేయాలన్నారు. సర్వే నంబర్ల వారీగా పంటలను నమోదు చేసుకోవాలని, రైతులు సహకరించాలని సూచించారు.

విద్యార్థులకు మిఠాయిల పంపిణీ

మాకవరపాలెం: శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా బూరుగుపాలెం ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఇక్కడి విద్యార్థులకు ఉపాధ్యాయిని సర్వలక్ష్మి, మాకవరపాలెం ప్రాథమిక పాఠశాల-2లో పూర్వ విద్యార్థి గెంజి ముత్యాలు వీటిని అందజేశారు. మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి దాతల నుంచి స్పందన వస్తోందని ఎంఈవో-2 మూర్తి తెలిపారు.

కొవ్వొత్తులతో నిరసన



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

నర్సీపట్నం: కోల్‌కత్తా వైద్యురాలి హత్యాచార ఘటనను నిరసిస్తూ వాకర్స్ క్లబ్, సీనియర్ సిటిజన్స్ మున్సిపల్ స్టేడియంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. క్లబ్ ప్రతినిధులు బేరా చినబాబు, అల్లు అప్పారావు, ఎం.ఎస్.ప్రసాద్, కామిరెడ్డి సత్యనారాయణ, ఆళ్ల వరప్రసాద్, బాబీ, అడిగర్ల వరహాలనాయుడు, వెంకటేశ్వరరావు, పిట్ల శ్రీనువాసరావు మాట్లాడుతూ ఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విశ్రాంత తహసీల్దార్ పి.కనకారావు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న పీసీసీ మాజీ కార్యదర్శి కొండలరావు

మాడుగుల రూరల్: దివంగత భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి కార్యక్రమం మాడుగులలో మంగళవారం నిర్వహించారు. ఇక్కడ రావిచెట్టు జంక్షన్‌లో రాజీవ్ గాంధీ విగ్రహానికి ఏపీ పీసీ మాజీ కార్యదర్శి పడాల కొండలరావు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అంతకు ముందు సెయింట్ ఆన్స్ ఆశ్రమంలో వృద్ధులకు, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏసు రాజు, బుడబండి రాజు, పుట్టా అమరయ్య గుప్తా, కొట్యాడ గాంధీ, ఆర్లె ధనుంజయ్, పాల్గొన్నారు.

24న సర్వసభ్య సమావేశం

నాతవరం: ఈ నెల 24న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో హనుమంతురావు తెలిపారు. ఎంపీపీ సాగిన లక్ష్మణ్‌మూర్తి అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని, ఎంపీటీసీలతోపాటు సర్పంచ్‌లు పాల్గొనాలని సూచించారు.

తాండవ ఆయకట్టులో.. జోరుగా వరినాట్లు



బుచ్చెయ్యపేట: మల్లాంలో వరి ఆకు తీస్తున్న కూలీలు

- ఒకేసారి పనులు ప్రారంభంతో ట్రాక్టర్లు, కూలీలకు గిరాకీ
- ఇతర ప్రాంతాల నుంచి రప్పిస్తున్న రైతులు

నాతవరం: ఖరీఫ్ సాగుకు తాండవ రిజర్వాయరు నీటిని విడుదల చేయడంతో ఆయకట్టులో వరినాట్లు జోరందుకున్నాయి. రిజర్వాయరు నీటిపై ఆధారపడి అనకాపల్లి జిల్లా నాతవరం, కోటవురట్ల, నర్సీపట్నం, పాయకరావుపేట మండలాలతోపాటు కాకినాడ జిల్లాలో కోటనందూరు, తుని, రవతలపూడి మండలాల పరిధిలో 52 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డల నీటితోపాటు విద్యుత్ మోటార్ల ఆధారంగా పలువురు రైతులు వరినాట్లు వేసుకున్నారు. నిమ్మకట్టు పరిధిలో మాత్రమే వరినాట్లు పడ్డాయి. మిగతా ప్రాంతాల్లో ఈ అవకాశం లేక తాండవ నీరు కోసం ఆశగా ఎదురుచూశారు. ఈ నేపథ్యంలో సోమవారం ప్రాజెక్టు నీటిని విడుదల చేయడంతో రెండు జిల్లాల పరిధిలో రైతులు వరినాట్లు వేసే పనిలో పడ్డారు. ఒకేసారి దమ్ము, వరినాట్లు పనులు ప్రారంభించడంతో ట్రాక్టర్లకు కూలీలకు గిరాకీ పెరిగింది. దాంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ట్రాక్టర్లు తీసుకొచ్చి దమ్ము చేస్తున్నారు. గంటకు రూ.వెయ్యి రూ.1,200పైగా తీసుకుంటున్నారు. కూలీలకు సైతం డిమాండ్ పెరగడంతో ఇతర ప్రాంతాల నుంచి రప్పిస్తున్నారు. ఇదే అవకాశంగా కూలి రేట్లు రూ.300 నుంచి రూ.400కు పెంచేశారు. ఒకప్పుడు మహిళలు మాత్రమే వరినాట్లు వేస్తుండేవారు. వీరికి గిరాకీ పెరగడంతో మగవారు సైతం వరినాట్లు వేస్తున్నారు.

ఎర్రవాయి గ్రామాల్లో ముమ్మరంగా..

బుచ్చెయ్యపేట: ఇటీవల కురిసిన వర్షాలకు ఎర్రవాయి గ్రామాల్లో వరి నాట్లు జోరందుకున్నాయి. ఇప్పటి వరకు ఎర్రవాయి గ్రామాలైన మల్లాం, ఆర్.భీమవరం, శివరాంపురం, రాజాం, నీలకంఠాపురం, తైపురం, తురకలపూడి, సీతయ్యపేట, కరక, పెదపూడి, చింతపాక, పెదమదీన, గున్నెంపూడి, కొండపాలెం తదితర గ్రామాల్లో వర్షాలు లేక వరినాట్లు పడలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూణ్నెల్లవుతున్నా ఎర్రవాయి గ్రామాల్లో రెండు వేల ఎకరాల లోపే వరినాట్లు వేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆయా గ్రామాల పొలాల్లో వర్షం నీరు చేరింది. దాంతో రైతులు దమ్ములు చేసి వరి ఆకులు తీసి నాట్లు వేస్తున్నారు. ఈ నెలాఖరులోగా వరినాట్లు వేయకపోతే ఆకులు ముదిరిపోయి పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు వాపోతున్నారు. అంతా ఒకేసారి వరినాట్లు వేయడంతో కూలీల కొరత ఏర్పడింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి ఆటోలు, వ్యాన్లలో కూలీలను తీసుకొచ్చి వరి నాట్లు వేస్తున్నారు. మండలంలో దిగువ గ్రామాలైన వడ్డాది, విజయరామరాజుపేట, చిన అప్పనపాలెం, లోపూడి, బుదిరెడ్లపాలెం, పొట్టిదొర పాలెం తదితర గ్రామాల్లో ఇప్పటికే 90 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి.



బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేట పొలాల్లో చేరిన వర్షం నీరు



నాతవరం: దమ్ము చేస్తున్న రైతు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

పలు హాస్టళ్లలో తహసీల్దారు ప్రసాద్ తనిఖీ



కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

మాకవరపాలెం: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ ప్రసాద్ ఆదేశించారు. కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని క్రిస్టియన్ ఆశ్రమంలో విషాహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన నేపథ్యంలో మంగళవారం ఆయన స్థానిక కేజీబీవీతోపాటు తామరం, కొండలఅగ్రహారంలో ఇమ్మాన్యుయేలు సంస్థ నిర్వహిస్తున్న హాస్టళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిత్యం అందించే భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, మిషనరీ యాజమాన్యాలు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. భోజనం తయారు చేసే పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. భోజనం సక్రమంగా లేకుంటే విద్యార్థులు నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. డీటీ కృష్ణమూర్తి, వీఆర్వోలు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం



శిథిల ఆలయ గోడలను తొలగిస్తున్న దృశ్యం

రోలుగుంట: స్థానిక నూకాంబిక ఆలయ పునర్నిర్మాణ పనులకు కమిటీ సభ్యులు మంగళవారం శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా శిథిల ఆలయంలో గోడలను తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శ్రీను, రమక్క మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ఇప్పటికే దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నామన్నారు. ఇంకా భక్తులు, దాతలు సహకారం అందించాలని కోరారు.

ఎక్స్‌గ్రేషియా రూ.25 లక్షలకు పెంచాలి

మాకవరపాలెం: విషాహారం తిని మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.25 లక్షలకు పెంచాలని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు, అధ్యక్షుడు వై.తాతబ్బాయి డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం కేవలం రూ.10 లక్షలతో సరిపెట్టకుండా రూ.25 లక్షలకు పెంచడంతోపాటు మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించి, వారికి ఆర్థిక సాయం అందించాలన్నారు.

విద్యార్థులు, వైద్యురాలి మృతికి సంతాపం..

గిడుతూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కోల్‌కత్తాలో హత్యకు గురైన వైద్యురాలితోపాటు ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. ఎంఈవో జన్‌ప్రసాద్, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బాబ్జీరావు, రిసోర్స్ పర్సన్లు రాము, బాలాజీ పాల్గొన్నారు.



వైద్యురాలు, విద్యార్థుల మృతికి సంతాపం తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఎస్సీ హాస్టళ్లకు ఫ్యాన్లు, పుస్తకాలు వితరణ

చోడవరం: హాస్టళ్లలో విద్యార్థులు క్రమశిక్షణలో కూడిన విద్యను అలవర్చుకోవాలని చోడవరం అంబేడ్కర్ ట్రస్ట్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి నడుపూరి సన్యాసిరావు తెలిపారు. స్థానిక ఇందిరా కాలనీలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహానికి నాలుగు ఫ్యాన్లు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. గాంధీగ్రామం ఎల్‌ఐసీ కాలనీలో ఎస్సీ బాలుర హాస్టల్‌కు నాలుగు ఫ్యాన్లు, విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు విద్యార్థులంతా కృషి చేయాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి, ఉన్నత శిఖరాలకు వెళ్లాలని కోరారు. ఎటువంటి దురలవాట్లకు ఆకర్షణ లోనుకాకుండా మంచిగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కండెల్లి వెంకటరావు, జుంజూరి అప్పారావు, వి. పైడారావు, అడ్వకేట్ భూపతి రాజు, హాస్టల్ వార్డెన్లు బి. ఈశ్వరరావు, జి. వరలక్ష్మి పాల్గొన్నారు.



ఫ్యాన్లు, దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న చోడవరం అంబేడ్కర్ ట్రస్ట్ ప్రతినిధులు

దేవరాపల్లి మండలాభివృద్ధికి సమష్టి కృషి

- ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి

దేవరాపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేద్దామని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. నూతన ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన కె. చంద్రశేఖర్‌ను స్థానిక ఎంపీపీ చాంబర్‌లో వారు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో కలిసి ఇన్‌చార్జి ఎంపీడీవోను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, బి.కింతాడ సర్పంచ్ బూరె బాబూరావు, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఎంపీటీసీలు రొంగలి నారాయణమ్మ, పంచాడ సింహాచలంనాయుడు, పోతల వెంకటరావు, కోలా గోపి, మజ్జి దేవి, రుత్తల లక్ష్మి, పాటేల ఈశ్వరమ్మ, బొడ్డు లక్ష్మి, బండి గౌరమ్మ, వంటాకు శ్రీను, మజ్జి రాజు, కె.వి.రమణ, చొక్కాకుల వెంకటరమణ పాల్గొన్నారు.



ఇన్‌చార్జి ఎంపీడీవోను సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, తదితర నాయకులు

ఘనంగా శివ పార్వతుల ఆలయ వార్షికోత్సవం

దేవరాపల్లి: ములకలాపల్లిలో శివ పార్వతుల ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయ పరిసరాలు శివ నామ స్మరణంతో మార్మోగాయి. స్థానిక ఆలయ పురోహితుడు పాకల కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామస్తులు శివ పార్వతులను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.



శివ పార్వతులను దర్శించుకుంటున్న గ్రామస్తులు

గాయపడ్డ కాశీపురం ఎంపీటీసీకి పరామర్శ



ఎంపీటీసీ పైడితల్లమ్మను పరామర్శిస్తున్న రమణమ్మ, ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సత్యం

దేవరాపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాశీపురం సెగ్మెంట్ ఎంపీటీసీ వంటాకు పైడితల్లమ్మను వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఇటీవల ఆస్పత్రిలో చేరి ఆపరేషన్ అనంతరం నాగయ్యపేటలోని ఆమె ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవానీ, ఎంపీటీసీలు నాగయ్యపేటలో పైడితల్లమ్మను వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని, ప్రమాదం తీరును ఆమె భర్త వంటాకు శ్రీనును అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని, త్వరగా కోలుకోవాలని వారు ధైర్యం చెప్పారు. ఎంపీటీసీలు రొంగలి నారాయణమ్మ, పోతల వెంకటరావు, పంచాడ సింహాచలంనాయుడు, కోలా గోపి, మజ్జి దేవి, రుత్తల లక్ష్మి, పాటేల ఈశ్వరమ్మ, బొడ్డు లక్ష్మి, బండి గౌరమ్మ, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, మజ్జి రాజు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

ఆర్‌వై అగ్రహారంలో ఏవో సోమశేఖర్ అవగాహన



ఆర్‌వై అగ్రహారంలో రైతులకు సూచనలను చేస్తున్న ఏవో సోమశేఖర్

కె.కోటపాడు: ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్న రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి పంట దిగుబడి పొందవచ్చని ఏవో సోమశేఖర్ తెలిపారు. ఆర్.వై.అగ్రహారంలో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు వరుస విధానంలో వరినాట్లు చేయాలని సూచించారు. తూర్పు నుంచి పడమరకు వరుసగా వేయాలని, తద్వారా పంటకు గాలి, వెలుతురు బాగా ప్రసరిస్తుందన్నారు. సులభంగా కలుపు తీసుకోవచ్చన్నారు. గట్లను శుభ్రపర్చుకోకపోవడం వల్ల పంటకు కలుపు తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది సూచించే జాగ్రత్తలు పాటించి మంచి పంట దిగుబడి పొందాలని సూచించారు. కార్యక్రమంలో భార్గవ్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ చైర్మన్ లాలం అచ్చింనాయుడు, రమణమూర్తి పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం



గుల్లేపల్లిలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెల్త్ అసిస్టెంట్ రాజు



నిమ్మగడ్డిని ప్రదర్శిస్తున్న ఎన్ఎస్ఎస్ పీవోలు

చోడవరం రూరల్: దోమల పెరుగుదల వల్ల వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. దోమలలో రకాలను గురించి, వాటి వల్ల కలిగే వ్యాధుల గురించి జంతుశాస్త్ర విభాగ అధిపతి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వి.రత్నభారతి వివరించారు. కళాశాల ప్రాంగణంలో పెంచుతున్న లెమన్‌గ్రాస్(నిమ్మగడ్డి) దోమల నివారణకు ఏ రీతిన ఉపకరిస్తున్నదీ కెమిస్ట్రీ విభాగాధిపతి లక్ష్మీమంగమ్మ, సూర్యవతి తెలియజేశారు. బోటనీ ఉపన్యాసకులు నారాయణమూర్తి, తాతాజీ తదితరులు తమ భావాలను తెలిపారు.

కె.కోటపాడు: దోమ రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం గుల్లేపల్లిలో దోమ కాటు వల్ల కలిగే వ్యాధులను ఆయన వివరించారు. అనాఫిలిస్ ఆడదోమ ద్వారా మలేరియా వ్యాధి సోకుతుందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా మురుగు నిల్వ లు లేకుండా ఇంటి పరిసరాల్లో చూసుకోవాలని సూచించారు. ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్ఎం లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి, ఆశా కార్యకర్త పైడితల్లమ్మ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

పశుసంవర్ధక శాఖ ఏడీ దినేష్‌కుమార్



టీకా వేస్తున్న ఏడీ దినేష్‌కుమార్



మినరల్ మిక్సర్ ప్యాకెట్లు అందజేస్తున్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి



టీకాలు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యవతి



నిండుగొండలో పశువులకు వైద్య సేవలందిస్తున్న పశువైద్యాధికారి నూకేశ్వర్రావు

కె.కోటపాడు: వర్షాకాలంలో పశువులు గాలికుంటు, బ్రూసెల్లా వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు టీకాలు వేయించాలని కె.కోటపాడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. కె.కోటపాడు, సింగన్నదొరపాలెం గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను మంంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో 38 వేల పశువులకు టీకాలు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గాలికుంటు టీకాలను నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు, బ్రూసెల్లా టీకాను 4 నెలల నుంచి 8 నెలల మధ్య ఆడపెయ్యలకు వేయాలని సూచించారు. వచ్చే నెల 11వ తేదీ వరకు టీకాలు వేస్తారని తెలిపారు. సిబ్బంది మనీషా పాల్గొన్నారు.

చీడికాడ: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తురువోలులో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ మట్టా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు బీల కోటేశ్వరావు, ఉప సర్పంచ్ పి.టి.బాబు మంగళవారం ప్రారంభించారు. గర్భకోశ వ్యాధులకు, చూడి నిర్ధారణకు పరీక్షలు, 17 పెయ్యిలకు నట్టల నివారణ మందులు, 98 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి రాఘవమ్మ తెలిపారు. అనంతరం పాడి రైతులకు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి బి. రామోహన్‌రావు, మాడుగుల ఏరియా పశువైద్యశాల ఏడీ వి. చిట్టినాయుడు మినరల్ మిక్సర్ ప్యాకెట్లు అందించారు. ఖండివరం పశువైద్యాధికారి గణేష్, పశుసంవర్ధక సహాయకులు రాజేష్, అర్జునమూర్తి పాల్గొన్నారు.

- జైతవరంలో పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ కోడూరి సత్యవతి ప్రారంభించారు. చీడికాడ పశువైద్యాధికారి గాయత్రీదేవి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఎంపీటీసీ పైలా ముత్యాలనాయుడు, వీఆర్వో గౌరీశంకర్, పంచాయతీ కార్యదర్శి గోపి, వెటర్నరీ అసిస్టెంట్ మోర్తా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోలుగుంట: నిండుగొండ, మనిపల్లి, తదితర గ్రామాల్లో రోలుగుంట పశువైద్యాధికారి నూకేశ్వర్రావు పశువులకు చికిత్సలు చేశారు. బుధవారం నుంచి గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేస్తామని తెలిపారు.

నర్సీపట్నం: జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని నర్సీపట్నం ఏరియా వెటర్నరీ హాస్పిటల్ ఏడీఏ డబ్ల్యూ రాంబాబు పేర్కొన్నారు. గాలికుంటు, బ్లూసెల్లా వ్యాధులు రాకుండా జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయంచాలన్నారు.

దేవరాపల్లి: గ్రామాల్లో గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధుల నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి కె. మంజుష తెలిపారు. రైతు సేవా కేంద్రాలలో టీకాలు అందుబాటులో ఉన్నాయని, పశు వైద్య సహాయకులను సంప్రదించాలన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



అధికారులతో కలిసి శ్మశానవాటికను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. బలిఘట్టం శ్మశాన వాటికను ఆయన మంగళవారం పరిశీలించారు. మున్సిపాలిటీలో రోడ్ల అభివృద్ధికి రూ. 4 కోట్లు మంజూరు చేశామన్నారు. పోలీసు స్టేషన్ దగ్గర నీరు పడితే ఎక్కడా ఆగకుండా కిందకు వెళ్లేలా మాస్టర్ ప్లాన్ తయారు చేసి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. పర్యాటకంపై విశాఖలో సంబంధిత మంత్రితో ఈ నెల 22న సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.వంద కోట్ల నిధులతో నర్సీపట్నం ట్యాంక్‌బండ్, కేడీపేట అల్లూరి పార్కు, లమ్మసింగి గెస్ట్‌హౌస్, బొర్రా గుహలను అభివృద్ధి చేసేందుకు ప్లానింగ్‌పై చర్చిస్తామన్నారు. మున్సిపాలిటీలో 12 శ్మశానవాటికలను ప్రైవేటు కంపెనీల భాగస్వామ్యంతో పార్కుల మాదిరిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాను. శ్మశానవాటికల నిర్వహణకు పట్టణ వాసులు ముందుకు రావాలన్నారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం ఈ నెల 30న ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశానికి కలెక్టర్, అధికారులు హాజరవుతున్నారన్నారు. ఏరియా ఆస్పత్రికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు మీటింగ్‌లో చర్చించటం జరుగుతుందన్నారు. ఆస్పత్రులో అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ డెలివరీ కేసులను బయటకు పంపించి వైద్యులు, వైద్య సిబ్బంది డబ్బులు పంచుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రైవేటు ఆస్పత్రులు హవా తగ్గించటమే తన ఉద్దేశమన్నారు. భోజనం బాగోలేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. రుచికరమైన భోజనం పెట్టేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రైవేటు అంబులెన్స్‌ల దోపిడీ ఎక్కువైందన్నారు. ఆస్పత్రులో అంబులెన్స్‌లు సరిపోకపోతే మరో రెండు తీసుకువస్తానన్నారు. మున్సిపల్ అధికారుల పనితీరు మరింత అధ్వానంగా ఉందని, ప్రతి పైసాకు కక్కుర్తి పడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. పనితీరుమార్చుకోని పక్షంలో పని చేసేవారిని తెచ్చుకుంటానన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువుల హత్యపై నిరసన



మాడుగులలో నిరసన తెలుపుతున్న హిందువులు

మాడుగుల: బంగ్లాదేశ్‌లో హిందువులను అతికిరాతకంగా హింసించి చంపిన ఘటనకు వ్యతిరేకంగా మాడుగులలో హిందువులు ఐక్యంగా నిరసన తెలియజేశారు. స్థానిక దేవీ ఆడిటోరియం నుంచి బస్టాండు మీదుగా ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు తీతంగా హిందువులు నిరసనలో పాల్గొన్నారు.